క్లుప్తంగా

మాధవరంలో పొలంబడి

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని మాధవవరంలో వ్యవసాయశాఖ ఏడీఏ మహ్మద్‌ఖాద్రి, ఏఓ జీరాగణేష్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగలో ఆకు ముడత పురుగు వల్ల కలిగే నష్టం, నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వ్యవసాయాధికారులు వివరించారు. అనంతరం మండలంలోని అగ్రిటెక్ ల్యాబ్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈవో నరసింహులు, రేఖామాధురి వీఏఏలు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలకు దరఖాస్తు చేసుకోండి

కౌతాళం: రైతుభరోసా కేంద్రాలకు అనుబంధంగా కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ) ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏఓ శేషాద్రి తెలిపారు. ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలో మూడు, లింగాలదిన్నెలో ఒకటి ఖాళీగా ఉన్నాయన్నారు. సీహెచ్‌సీ కింద రూ.15లక్షల విలువైన వ్యవసాయ పరికరాలతో పాటు ఒక ట్రాక్టర్‌ను సబ్సిడీపై ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శివమాలధారణ



శివభక్తులకు మాలధారణ చేస్తున్న గురుస్వామి శైలేంద్రనాథ్

ఆదోని అర్బన్: మహాశివరాత్రిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీశంఖులింగేశ్వర స్వామి ఆలయంలో శివభక్తులు 11 రోజుల మాలను స్వీకరించారు. బుధవారం గురుస్వామి శైలేంద్రనాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా శివభక్తులు శంఖులింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాలధారణ చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ప్రసాదం నిర్వహించారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



19వ వార్డులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఆదోని టౌన్: పట్టణంలోని 19వ వార్డు కపర్తి నగర్‌లో సీసీ రోడ్లు, మురుగుకాలువల నిర్మాణం పనులను కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. నాణ్యతగా అభివృద్ధి పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం వార్డు సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ సేవలు మరింత మెరుగుపడాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేయాలని చెప్పారు.

టీచర్లను నియమించాలని ఆందోళన



ప్రాథమిక పాఠశాల ఎదుట నిరసన తెలియజేస్తున్న దృశ్యం

ఆదోని రూరల్: మండలంలోని పాండవగల్లు ప్రాథమిక పాఠశాలకు టీచర్లను నియమించాలని కోరుతూ సీపీఎం నాయకులు బుధవారం స్కూల్ ఎదుట నిరసన తెలిపారు. స్కూల్‌లో 200 మంది విద్యార్థులుంటే కేవలం ఇద్దరు టీచర్లు ఉన్నారని, దీంతో విద్యాబోధన సాగడం లేదని వారు చెప్పారు. అధికారులు స్పందించి వెంటనే టీచర్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.వెంకటేశులు, పాండురంగ, గోవిందు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

ఆదోని అర్బన్ : జిల్లా పశ్చిమ ప్రాంతంలోని పెండింగ్ నీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు షాహిద్ అఫ్రిద్ కోరారు. కరువు, వలసలు ఆగాలంటే వేదావతి ప్రాజెక్టుతో పాటు ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం చేపట్టాలన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమలో ఏళ్ల తరబడిగా పలు ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని పూర్తి చేస్తే సాగు నీటి కష్టాలు ఉండవన్నారు. కార్యక్రమంలో నాయకులు భరత్, పవన్, వినయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా మద్దతు వైఎస్ జగన్‌కే

- ప్రతిపక్ష పార్టీలకు మళ్లీ ఓటమి తప్పదు
- భగవంతుడి ఆశీస్సులు, ప్రజల ఆదరాభిమానాలు జగన్‌కు మెండు
- 'గడపగడపకు మన ప్రభుత్వం' లో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



కపటిలో మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల మద్దతు మెండుగా ఉందని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు పన్నినా వారికి ఓటమి తప్పదని, భగవంతుడి ఆశీస్సులు, ప్రజల ఆదరాభిమానాలతో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారని ఆయన చెప్పారు. బుధవారం మండలంలోని కపటి గ్రామంలో రెండోరోజు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు చేకూరిన లబ్ధిని చెప్పి, ఇంకా ఏవైనా సమస్యలుంటే వాటిని పరిష్కరించేందుకే తాము గడపగడపకు వస్తున్నామన్నారు. దీనిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీల నాయకులు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. వారి మాటలను ప్రజలు విశ్వసించారని చెప్పారు. ప్రజల గుండెల్లో జగన్ చెరగని స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 95 శాతం ఇప్పటికే అమలు చేసి రికార్డు సృష్టించారన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని చెప్పారు. గత ప్రభుత్వాలు ప్రజలను, రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకునేవి కావన్నారు. టీడీపీ హయాంలో కేవలం వారి పార్టీ నాయకులకే లబ్ధి చేకూరిందన్నారు. అందుకే 2019 ఎన్నికల్లో ఆ పార్టీని ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అమలు చేసిన అమ్మ ఒడి, చేదోడు, రైతుభరోసా, పింఛన్ల పెంపు, సచివాలయ వ్యవస్థ తదితర వాటితో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతావాణి, ఆర్‌ఐ జయరామిరెడ్డి, ఈఓపీఆర్‌డీ జనార్దన్, పీఆర్ ఏఈ మాలిక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, ఏపీఓ చంద్రశేఖర్, ఏపీఎం జనార్దన్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డా.మధుసూదన్, ఎంపీపీ దానమ్మ, మాజీ ఎంపీపీ పంపాపతి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాసు, వైసీపీ పట్టణ సెల్ అధ్యక్షుడు పరిగల నారాయణ, మహిళా డైరెక్టర్లు రేణుక, మంజుల, మాజీ సర్పంచ్ రాజు, మృత్యుంజయస్వామి, నాయకులు కడబూరయ్య, చంద్రశేఖర్‌గౌడ్, రాఘవేంద్రగౌడ్, గోపాల్‌గౌడ్, నారాయణగౌడ్, శంకరప్పగౌడ్, రామిరెడ్డి, భాస్కర్, దేవదాసు, వీరేష్, వెంకటస్వామి, రాజు పాల్గొన్నారు.

భీరలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ఆదోని అర్బన్ : పట్టణంలోని బీరప్పనగర్‌లో వెలిసిన శ్రీ భీరలింగేశ్వరస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహం ప్రతిష్ఠించి 29 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆలయప్రెసిడెంట్ చావడి నాగప్ప ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. తర్వాత భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అక్రమ అడ్మిషన్లను అరికట్టాలి

ఆదోని అర్బన్: కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న అక్రమ అడ్మిషన్లను అరికట్టాలని పీడీఎస్‌ఓ డివిజన్ ప్రెసిడెంట్ ఖాదర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023–24 విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు ప్రారంభించి పిల్లల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేయడం సరికాదన్నారు. విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి సదరు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో తాము పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు శివ, మోహన్, బాషా, గోపాల్, నవీన్, సోము తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- గృహసారథులు, కన్వీనర్లకు యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి



మాట్లాడుతున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోని టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం చేయాలని వైఎస్సార్‌సీపీ యువనేత, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమంపై స్థానిక ద్వారకా ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. 300 మంది గృహసారథులు, 34 మంది కన్వీనర్లు, మున్సిపాలిటీ పరిధిలోని వాలంటీర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రతిపక్షాల విమర్శలు, దుష్ప్రచారాన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. వారిని ప్రజలు నమ్మరన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనుల గురించి ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, మండల కన్వీనర్లు మధుసూదన్‌శర్మ, ఫయాజ్ అహ్మద్, శ్రీనివాసరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్‌లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ముగింపు దశలో బాపురం వంక బ్రిడ్జి పనులు



బదినేహాల్ వద్ద ముమ్మరంగా సాగుతున్న వంతెన నిర్మాణ పనులు

చకచకా వంతెనల నిర్మాణం

కౌతాళం: మండలంలో వంతెనల నిర్మాణ పనులు చకచకా సాగుతున్నారు. వర్షాకాలంలోపు పనులు పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. బాపురం గ్రామం వద్ద వంక బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో చిన్న పాటి వర్షం వచ్చినా రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో డంబలదిన్నె, అగసలదిన్నె, లింగాలదిన్నె గ్రామాలతో పాటు కాత్రికి, నదిచాగి గ్రామాలకు వెళ్లాలంటే చాలా కష్టంగా మారేది. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి రూ.55 లక్షల మంజూరు చేయించారు. ఈ నిధులతో గతేడాది నవంబర్‌లో పనులు ప్రారంభించారు. ఇప్పుడు పనులు చివరి దశకు చేరుకున్నాయి. అలాగే బదినేహాల్ గ్రామ సమీపంలో కమ్మలి తాత దర్గా వద్ద వంకపై నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. రూ.45 లక్షలతో ఈ పనులు జరుగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయితే బదినేహాల్ గ్రామంతో పాటు కుంటనహాల్, ఉప్పరహాల్ వాసులకు రాకపోకల సమస్య తీరుతుంది.

క్రీడలతో మానసికోల్లాసం



ఖోఖో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ ఈరన్న

కోసిగి: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎంపీపీ ఈరన్న అన్నారు. బుధవారం కోసిగిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరను పురస్కరించుకుని ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి సహకారంతో జిల్లా ఖోఖో అసోషియేషన్ నాయకులు పీడీ ఖలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో అంతర్ రాష్ట్ర ఖోఖో పోటీలు జరిగాయి. ఈ పోటీలను ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.15వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు మహంతేష్ స్వామి, వైఎస్సార్ సీపీ మండల నాయకులు నాడుగేని నాగరాజు, మాణిక్యరాజు, హొళగుంద కోసిగయ్య, వక్రాని వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ మంగమ్మ, బుళ్లి నరసింహులు, పాఠశాల ఉపాధ్యాయుడు రామాంజినేయులు, ఆర్గనైజర్స్ నారాయణ కళాశాల పీడీ బాలకృష్ణ, కేశవ్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూ నూతన కమిటీ ఎన్నిక

ఆదోని అర్బన్ : నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆదోని డిపో నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడిగా చంద్రకాంత్‌రెడ్డి, ముఖ్య సలహాదారుడిగా బి.లక్ష్మన్న, డిపో అధ్యక్షుడిగా ఎస్.ఆరోగ్యప్ప, కార్యదర్శిగా హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామలింగప్ప, ఉపాధ్యక్షులుగా బసవరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామలింగేశ్వరయాదవ్, జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి, రీజనల్ కార్యదర్శి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు వలంటీర్లకు మెమోలు

చిప్పగిరి: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆరుగురు వలంటీర్లకు మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీఓ సుధాకర్ రాజు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని ఏరూరు గ్రామానికి చెందిన ఆరుగురు వలంటీర్లు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి జయరాం నాయక్ తమ దృష్టికి తెచ్చారన్నారు. విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలలో భాగంగా మెమోలు జారీ చేశామన్నారు. గ్రామ వలంటీర్లు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ విధులు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

దస్తగిరి స్వామి ఉరుసు

ఆస్పరి: కొలిచే వారికి కొంగు బంగారంగా పేరొందిన దస్తగిరి స్వామి 267 ఉరుసు ఉత్సవాలు ములుగుందంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం దస్తగిరి స్వామి గుర్రాన్ని అందంగా అలంకరించి గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు స్వామి వారి గుర్రానికి బిందెలతో నీళ్లు పోసి పూజించారు. గుర్రం దర్గాకు చేరే వరకు భక్తులు వెంట నడిచారు. దస్తగిరి స్వామి సమాధిని ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పీర్ల చావిడి నిర్మాణానికి వారు రూ.50 వేలు విరాళం గ్రామ పెద్దలకు అందజేశారు. జెడ్పీటీసీ దొరబాబు, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ ములింటి రాఘవేంద్ర, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, సీఈఓ అశోక్ పాల్గొన్నారు.

నారాయణ విద్యా సంస్థపై చర్యలు తీసుకోవాలి



ఆదోనిలో ధర్నా చేస్తున్న డీఎస్ఎఫ్ నాయకులు

ఆదోని రూరల్ : ఫీజు పేరుతో విద్యార్థిని ప్రాణాలు బలిగొన్న నారాయణ విద్యాసంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లాలో నారాయణ కళాశాలకు చెందిన ఓ విద్యార్థిని బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుందని, ఇందుకు సదరు కళాశాల ఒత్తిడే కారణమని ఆరోపించారు. వెంటనే ఆ విద్యాసంస్థపై చర్యలు తీసుకుని, బాధిత విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని బుధవారం ఆదోని ఆర్ట్స్ కళాశాల ఎదుట డీఎస్ఎఫ్ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్, డివిజన్ అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ వేలకు వేలు ఫీజులు కట్టాలంటే పేద పిల్లల తల్లిదండ్రులకు భారమవుతుందన్నారు. కొందరు కట్టలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు వంశీ, చిరు, అరవింద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీవిద్య

పెద్దకడబూరు: అందరం కలిసి మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ శ్రీవిద్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ వెంకటరమణప్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, అభివృద్ధిపై సమీక్షించారు. అనంతరం మండల అధ్యక్షురాలు మాట్లాడుతూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తమతమ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అలాగే ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, ఉపాధ్యక్షుడు పరమేష్‌గౌడ్ అదనపు ఉపాధ్యక్షుడు ఇర్ఫాన్ దేశాయ్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పురుషోత్తంరెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సీడీపీఓ నిర్మలాదేవి, మండల విద్యాధికారిణి సువర్ణలసునియం, కో ఆప్షన్ సభ్యుడు షేక్‌ఖాన్‌పటేల్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా విశ్వలింగేశ్వర స్వామి ప్రభోత్సవం



ఊరేగుతున్న స్వామి ప్రభోత్సవం

కోసిగి: అగసనూరు గ్రామంలో శ్రీ విశ్వలింగేశ్వర స్వామి ప్రభోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా బుధవారం వేకువ జామున నుంచి ఆలయ పూజారి ఈరన్న స్వామి ఆధ్వర్యంలో స్వామికి జలాభిషేకం, రుద్రాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజ, మహా మంగళ హారతులు నిర్వహించారు. గ్రామస్తులు స్వామిని దర్శించుకుని నైవేద్యం, నారకేలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రభోత్సవంపై స్వామి వారి మూలవిరాట్‌ను కొలువుంచి ఊరేగించారు. ఈ వేడుకను తిలకించేందుకు కందుకూరు, సాతనూరు, మూగలదొడ్డి, కర్ణాటక రాష్ట్రంలోని జూకూరు, రాజోలి బండ తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

ఎల్లమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ ఎరిసా వలి, ఎస్ఐ రాజారెడ్డి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో ఈనెల 11 వ తేదీన జరిగే రేణుక ఎల్లమ్మ జాతరలో ఏర్పాట్లను సీఐ ఎరిసా వలి, ఎస్ఐ రాజారెడ్డి బుధవారం పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ అర్చకుడు అయ్యన్నగౌడకు సూచించారు. అమ్మవారి దర్శనార్థం కర్నూలు జిల్లా నుంచే కాక కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి రానున్నట్లు తెలిపారు. ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, అలాగే అమ్మవారి రథోత్సవం సమయంలో తోపులాట జరగకుండా చూడాలన్నారు.

మత్తుతో జీవితాలు నాశనం

- మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సులో సెబ్ సీఐ హరికృష్ణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సెబ్ సీఐ

ఆదోని రూరల్ : మత్తు పదార్థాల జోలికి వెళ్లితే జీవితాలు నాశనమవుతాయని సెబ్ సీఐ హరికృష్ణ అన్నారు. ముఖ్యంగా యువత మత్తుకు దూరమై సమాజానికి దగ్గరవ్వాలని చెప్పారు. బుధవారం ఆదోని–ఆలూరు రోడ్డులోని భీమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో 'అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, కొకైన్ లాంటి వాటికి ఎవరూ బానిసలు కాకూదన్నారు. వాటి విక్రయాలను నియంత్రించేందుకు ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టిందన్నారు. సదస్సులో సెబ్ ఎస్ఐ శివప్రసాద్, కాలేజీ సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేంద్రబాబు, ఎన్ఎస్ఎస్ పీడీ డా.బాలాజీ, సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



అలువాలలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ వెంకటనారాయణ, అధికారులు

గోనెగండ్ల: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ వెంకటనారాయణ సూచించారు. ఆయన బుధవారం మండల పరిధిలోని అలువాల, కులుమాల, హెచ్ కైరవాడి గ్రామాల్లో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ.. మండల అధికారులు ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబడిన కాలనీలను సందర్శించాలన్నారు. ఇంటి నిర్మాణంలో జాప్యానికి గల కారణాలను తెలుసుకొని లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం సిమెంట్, స్టీలు, ఇసుక అందిస్తుందన్నారు. బిల్లులు కూడా సకాలంలో మంజూరవుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఇంటి నిర్మాణం చేపట్టని లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. హౌసింగ్ డీఈ ప్రసాద్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్, వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, ఏఈ ప్రసాద్, లక్ష్మన్న, విద్యుత్ ఏఈ సుధాకర్‌రావు, ఏపీఎం హేమలత, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

24 నుంచి నెరణికితండాలో ఉత్సవాలు

హొళగుంద: నెరణికి తండాలో ఈ నెల 24న మునిస్వామి, చౌకా స్వామిల రథోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ పారుబాయి, ఎంపీటీసీ సంధ్యాబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవంలో భాగంగా 24న మేటి కుంభోత్సవంతో పాటు రాత్రి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా స్వామి వారికి జలాభిషేకాలు, ఆకుపూజ, మహా మంగళ హారతి, నైవేద్య సమర్పణ తదితర ప్రత్యేక పూజలను నిర్వహించి మేటి కుంభోత్సవంతో పాటు పల్లకీ ఊరేగింపు తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. వేడుకల్లో భాగంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. అదేవిధంగా 25న మారెమ్మ దేవర ఘనంగా జరుగుతుందని భక్తులు తరలి రావాలని వారు కోరారు.

రస్తా వివాదంపై జిల్లా కలెక్టర్ పరిశీలన



హలిగేరలోని బీసీ కాలనీలో పర్యటిస్తున్న జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు

ఆస్పరి: హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం ఆస్పరి మండలంలోని హలిగేర గ్రామ బీసీ కాలనీలో నెలకొన్న రస్తా వివాదంపై జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు వాస్తవాలు పరిశీలించడానికి వచ్చారు. రస్తా స్థలం తన సొంతం అంటూ ఓ వ్యక్తి గతంలో కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు జిల్లా కలెక్టర్ బీసీ కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. రస్తా విషయంపై కాలనీ వాసులు కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. పరిశీలన నివేదికను హైకోర్టుకు సమర్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. డీపీఓ నాగరాజు నాయుడు, పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్, తహసీల్దార్ కుమారస్వామి, డీఎల్‌పీఓ శ్రీకాంత్ చౌదరి, ఎంపీడీఓ రాధ, ఈఓఆర్డీ సూర్య నరసింహారెడ్డి ఉన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

పత్తికొండ రూరల్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సూచించారు. ఆయన బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన మోటివేషన్ కార్యక్రమంలో మాట్లాడారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి విద్యార్థులను చదివిస్తున్నారని, వారి కష్టాన్ని గుర్తుంచుకుని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. మార్చి 1వ తేదీ నుంచి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తారని తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్, మోటివేషనల్ స్పీకర్ రంగబాబు, ఎస్ఎస్ఏ పీఓ వేణుగోపాల్, పత్తికొండ తహసీల్దారు విష్ణుప్రసాద్, ఎంఈఓ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.